సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,2 జూన్ 2024


# ఈదురు గాలులతో భారీ వర్షం

- నేలకొరిగిన భారీ వృక్షం
- మూడు విద్యుత్ స్తంభాలు ధ్వంసం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మండలంలో శనివారం తెల్లవారుజామున భయంకర ఉరుములు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు మాచవరం పంచాయతీ పక్క వీధిలో ఉన్న భారీ వృక్షం నేలకొరిగి ఓ ఇంటిపై పడటంతో స్వల్పంగా ధ్వంసమైంది. అలాగే మూడు విద్యుత్ స్థంబాలు, వైర్లు విరిగి పడిపోయాయి. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే పసుపల్లి, వాకలగరువు, నందంపూడి, మాచవరం, పోతాయిలంక గ్రామాల్లో విద్యుత్ వైర్లపై కొబ్బరి చెట్లు, భారీ వృక్షాల కొమ్మలు పడి విద్యుత్ వైర్లు, కండెన్సర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలు చోట్ల అరటి చెట్లు విరిగి నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సరఫరాను పునరుద్ధరించారు.వేకువజామునఉరుములు భయంకర శబ్దాలు చేయడంతో వృద్ధులు, చిన్నారులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.

## జూన్ 4 నాటి ఓట్ల లెక్కింపు కోసం

# కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లు పూర్తి

- కౌంటింగ్ కేంద్రం లోకి అనుమతించే ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు జారీ
- ఈవిఎమ్ , పోస్టల్ బ్యాలెట్, ఈటిపిబిఎస్ ఓట్లు లెక్కింపు అనుగుణంగా చర్యలు
- ఈవిఎమ్ ఓట్ల కోసం పిసి పరిధిలో 98 టేబుల్స్ 116రౌండ్స్,ఏసిపరిధిలో 98టేబుల్స్ 116రౌండ్స్,
- ఈటిపీబిఎస్, పోస్టల్ బ్యాలెట్ కోసం 18 టేబుల్స్ ఏర్పాటు
- ఓట్ల లెక్కింపు కోసం తగిన 2500 మంది మానవ వనరుల సిద్ధం చేశాం
- కౌంటింగ్ సందర్భంలో కేంద్ర,రాష్ట్ర జిల్లా స్థాయిలో మూడంచెల భద్రత ఏర్పాట్లు
- గుర్తింపు కార్డు కలిగిన కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్స్ తరలింపుకు ఏర్పాట్లు చేశాం
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత,ఎస్పి జగదీష్




**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే13 జిల్లాలో అత్యంత ప్రసాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఇందుకు సహకరించిన ప్రజలకు మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ అదే రీతిలో జూన్ 4 వ తేదీ మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు సహాకారాన్ని అందించి కౌంటింగ్ ప్రక్రియని విజయవంతం చేద్దామని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డాకె. మాధవీలత, ఎస్పీ పి. జగదీష్ లు తెలియ చేశారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ మాధవీలత , ఎస్పిపి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ లు పాత్రికేయులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా జూన్4మంగళవారం రోజున చేపట్టనున్న ఎన్నికల కౌంటింగ్ నేపధ్యంలో అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాటు చేసామన్నారు. నన్నయ్య యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రం లోకి కౌంటింగ్ సిబ్బంది, ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిన వారిని, ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యే ఎన్నికల సిబ్బంది, అభ్యర్ధులను, ఎన్నికల ఏజెంట్స్, కౌంటింగ్ ఏజెంట్స్ లని మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. నియోజక వర్గాల వారీగా గుర్తింపు కలర్ కోడ్ ఇస్తూ వారిని తప్ప ఆయా నియోజక వర్గాల కౌంటింగ్ హాల్‌లోకి ఇతర వ్యక్తులను అనుమతించడం జరగదన్నారు. ర్యాండమైజేషన్ ద్వారాసిబ్బందికిటేబుల్సు కేటాయింపు ఉంటుందన్నారు. కౌంటిగ్ ఏజెట్లు వారి కేయాటించిన నియోజవర్గం కౌంటిగ్ హాల్ నుంచి కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు బయటకు వెళ్లే వీలులేదన్నారు. ఈవిఎమ్ , పోస్టల్ బ్యాలెట్, ఈటిపిబిఎస్ ఓట్లు లెక్కింపు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లో భాగంగా ఈవిఎమ్ ఓట్ల కోసం పిసి పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్,ఏసి పరిధిలో 98 టేబుల్స్ 116 రౌండ్స్, ఈటిపీబిఎస్, పోస్టల్ బ్యాలెట్ కోసం 18 టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన ఓట్లు లెక్కింపు కోసం సహాయ రిటర్నింగ్ అధికారులు 7 గురు, కౌంటింగ్ సూపర్వైజర్ లు 119, సహాయకులు 126 , సూక్ష్మ పరిశీలకులు 140 , ఇతర సిబ్బంది 119 మంది చొప్పున విడివిడిగా నియమించినట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో సుమారు 2500 మంది సిబ్బందిని కౌంటింగ్ ప్రక్రియలో నియమించామన్నారు. మొత్తం 17 కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేసామన్నారు. ఇందులో 7 అసెంబ్లీ, 7 పార్లమెంట్ కాగా 3 పోస్టల్ బ్యాలేట్ (ఒకటి పార్లమెంట్ రెండు అసెంబ్లీ) కుసంబందించినవి అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని, అందులో భాగంగా రాజమండ్రి పార్లమెంట్ రాజమండ్రి సిటీ అసెంబ్లీ, రాజమండ్రి రూరల్ నియోజకవర్గం పరిదిలో ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్, ఈవీయంలు లెక్కింపు సమాంతర సమయంలోఉంటుందన్నారు. కొవ్వూరు,గోపాలపురం,నిడదవోలు,అనపర్తి,రాజానగరం నియోజక వర్గాల్లోని కౌంటింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలేట్ లెక్కింపు ఉదయం 8 గంటలకు,ఈవీయం ఓట్ల లెక్కింపు ఉదయం8.30 గంటలకు ప్రారంబించడం జరుగుతుందన్నారు.కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో బాణ సంచా విజయోత్సవ ర్యాలీలు, సమావేశల పై జూన్ 6వ తేదీ వరకు నిషేదిత ఉత్తర్వులుఅమల్లో ఉన్నాయని అటువంటి కార్యక్రమాలకు ఎవరూ పాల్పడవద్దని జిల్లా ఎన్నికల అధికారి డా. మాధవీలత విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమావళి దృష్ట్యా ఎటువంటి కవ్వింపులకు అనవసరంగా రెచ్చగొట్టే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని, ఎటువంటి చట్టవిరుద్దమైన వ్యతిరేక ప్రకటనలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే అటువంటి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు.జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొవ్వూరు నియోజకవర్గం 13 రౌండ్లు మధ్యాహ్నం 12.40కు, రాజమండ్రి రూరల్ మధ్యాహ్నం 2.30 గంటలకు ఫలితాలను ప్రకటించే విధంగా కార్యాచరణను సిద్ధం చేశామన్నారు.ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ, నన్నయ్య యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. యూనివర్సిటీ ఆవరణలో ఒక కీలో మీటరు పరిధిలో 144 సెక్షన్ , 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నట్లు తెలిపారు. జూన్ 6 వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని ఎటువంటి హింసాత్మకమైన సంఘటనలకు పాల్పడటం, ప్రేరేపించడం గాని చేస్తే అటువంటి వారిపై చట్టమైన చర్యలు తీసుకొని బైండవర్ కేసులు నమోందు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 130 మంది పై కేసులు నమోదు చేసామన్నారు. ప్రతి ఐదేళ్ళకు ఒకసారి జరిగే సార్వత్రిక ఎన్నికల సమయంలో అటువంటి వారిని ముందస్తు జాగ్రత్తగా అరెస్టు చేయడం జరుగుతుందని, ఇంటువంటి సంఘటనలకు ఎవరు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. సుమారు 1500 మంది భద్రతా సిబ్బంది ఎన్నికల విదుల్లో పాల్గొన్నారని, మరో రెండు కేంద్ర బలగాలు జిల్లాకు రానున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు సమస్యాత్మకమైన 162 గ్రామాలను గుర్తించామని ఆయా ప్రాంతాల్లో నిఘా పెంచడంతో పాటుల డ్రోన్ కేమారాలు ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నన్నయ్య యూనివర్సిటీ ఆవరణలో సుమారు 2.5 కిలోమీటర్ల మేర నో- డ్రోన్ పై ఏరియా ప్రకటించామన్నారు. ఎగ్జిట్ పోల్స్ నేపద్యంలో సమూహాలు గా ఏర్పడటం గాని ర్యాలీలు నిర్వహించడం గాని, బాణా సంచా కాల్చడం గాని, సమాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు, వాఖ్యలు చేయడం వంటివి చట్టవిరుద్ద కార్యకలాపాలుగా నిర్ధారణ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. నన్నయ్య యూనివర్సిటీ మార్గంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నామని ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. రాజమండ్రి వైపు నుండి వచ్చు అన్నీ రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్ లు దివాన్ చెరువు వద్ద గల ఫ్రూట్ మార్కెట్ సమీపంలోన్ డీవీబి రాజు చెందిన ఖాళీ స్థలములలో వారి వాహనములను పార్కింగ్ చేసుకోవాలని, రాజానగరం వైపు నుండి వచ్చు అన్నీ రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్ లు రాజానగరం దుర్గమ్మ గుడి జంక్షన్ దగ్గర గల ఖాళీ స్థలములలో వారి వాహనములను పార్కింగ్ చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, మీడియా వారికి గైట్ కళాశాల ఆవరణలో పార్కింగ్ స్థలాలను కేటాయించామన్నారు.మీడియా సమావేశంలో జాయింట్ కలెక్టకరు ఎన్. తేజ్ భరత్, డిఆర్వో. జి.నరశింహులు పాల్గొన్నారు.

## కె.ఎన్.హెచ్.శ్రీనివాస్‌కు జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందంసిఫార్సు మేరకు కె.ఎన్. హెచ్ .శ్రీనివాస్ సిద్ధాంత వ్యాసం "స్పీచ్ ఎన్‌హాన్స్‌మెంట్ యూజింగ్ మోడిఫైడ్ గ్రీడీ డిక్షనరీ లెర్నింగ్ అల్గోరిథమ్స్ అండ్ స్పార్స్ రికవరీ" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. కె.ఎన్.హెచ్.శ్రీనివాస్ తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా. ఐ.శాంతిప్రభ మరియు గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఈసిఈ విభాగం డా. ఎం.వేణుగోపాలరావు ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## విద్యార్థులకు అందించే భోజనం శుచిగా, రుచిగా తయారు చేయాలి



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మధ్యహ్న భోజన పథక నిర్వహకులు విద్యార్థులకు అందించే భోజనాన్ని శుచి, శుభ్రతతో అందించాలని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మిడ్ డే మీల్స్ ఏడీ ఎన్. సురేష్ పేర్కొన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ - 1 కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 మోకా ప్రకాష్ ఆధ్వర్యంలో మధ్యహ్న భోజన పథక నిర్వహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ పోషకాహారాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. శుచిగా, రుచికరంగా వండడంలో ఏజెన్సీల నిర్వాహకులు నైపుణ్యం చూపాలన్నారు. ముందుగా విద్యాశాఖాధికారులు సూచించిన ప్రకారం మధ్యాహ్న భోజన పథక వీడియోలు చూపించి వంటకం ఎలా చేయాలో వివరిస్తూ పీపీటీలను స్టార్ టీవీల ద్వారా ప్రయోగాత్మకంగా చూపించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తయారు చేసిన వంటకాలను అధికారులు రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం కడలి సాయిరామ్, పీహెచ్సీ వైద్యాధికారి కె.నాగ శ్రీనివాస్, సీహెచ్ఓ బి.అప్పారావు, డీఈఓకార్యాలయసిబ్బంది మౌనిక, సౌజన్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మండలంలో హనుమాన్ జయంతి వేడకలనుభక్తులు భక్తిశ్రద్ధలతోశనివారం ఘనంగా నిర్వహిం చారు. అంబాజీపేట పశువుల మార్కెట్లో అభయాంజ నేయస్వామి, పెద్దవీధిలోని నాగమల్లి చెట్టు వద్ద ఉన్న దాసాంజ నేయ స్వామి, గంగలకుర్రు అగ్రహారం ముషిణి వారిపాలెం హనుమాన్ సెంటర్‌లోను, ఇరుసుమండలోని భక్తాంజనేయ స్వామి, వ్యాఘేశ్వరం, మాచవరం, గంగలకుర్రు, వక్కలంక, ముక్కామలలో ఆంజనేయ స్వామికి లక్ష తులసి, తమలపాకుల పూజ, సింధూర పూజలు నిర్వహించారు. పోతాయిలంకలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ ప్రాంగణాల వద్ద భారీ అన్నసమారాధన జరిపారు. పసుపల్లిలో సీతారామ పట్టాభిషేకం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## మార్షల్ ఆర్ట్స్‌పై విద్యార్థులకు శిక్షణ



**పెద్దాపురం,రూరల్,మేజర్న్యూస్ :** పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ శనివారానికి 21వ రోజుకు చేరుకుంది. శనివారం విద్యార్థులకు మల్లా సుధాకర్ మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఎలిమెంటరి విద్యార్థులకు బుద్ధా శ్రీనివాస్ క్విజ్ పోటీలు నిర్వహించి, జనరల్ నాలెడ్జి, దేశాలు, రాష్ట్రాలు వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. హైస్కూల్ విద్యార్థులకు బియ్యపుగింజలతో ఆర్ట్ వేయడం నేర్పించారు. కర్రసాముపై నీలపాల కృష్ణ, వినోద్‌లు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, పూజిత, సూర్యశ్రీ, వలంటీర్లు మంజుల, సత్య, అమృత, సాయి, నేహ, సాయికుమార్, రేణుక, పవన్, మణికంఠ, వివేక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## అవేశాలతో బంగారు భవిష్యత్ పాడు చేసుకోవద్దు

- ఐజి, ప్రత్యేక అధికారి ఎం.రవి ప్రకాష్



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ప్రతి ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజం. అనసరంగా కార్యకర్తలు, ప్రజలు అవేశాలకు లోనయితే ఫలితం ఆయా కుటుంబాలపై పెద్ద ప్రభావం చూపుతుందని రాష్ట్ర సెబ్ ఐజి, ప్రత్యేక అధికారి ఎం.రవి ప్రకాష్ అన్నారు. అనవసరంగా అల్లర్లుకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని ఆయన హెచ్చరించారు. అమలాపురంలో ఆయన ఎస్పీ ఛాంబర్‌లో శనివారం సాయంత్రం పాత్రికేయులతో మాట్లాడారు. కౌంటింగ్ పై ఏలూరు రేంజ్ పరిధిలోని అందరి ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశానన్నారు. నాలుగు అంచెల భద్రతతో కౌంటింగ్ కేంద్రం వద్ద పహారా ఏర్పాటు చేశామన్నారు. కోనసీమ అల్లర్లులో మొదటి స్థానం ఉండటంతో మరింత పటిష్ట చర్యలు తీసుకున్నామని రవి ప్రకాష్ అన్నారు. అనపర్తి, పిఠాపురం, దెందులూరు, పెనములూరు, మచిలీపట్నం తదితర నియోజకవర్గాల్లో అధిక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాటు, ఏదయినా సంఘటన జరిగితే 5 నుంచి 10 నిమిషాల్లో క్విక్ రియాక్షన్ టీమ్స్ ఆ ప్రాంతానికి పోలీస్ చేరుకుని కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ఆ టీమ్స్ పూర్తిగా ఎస్ఐ, సీఐ లు పర్యవేక్షణలో ఉంటాయన్నారు. 144, 30 అమల్లో వున్నాయని, మితిమీరవద్దని ఆయన హితవు పలికారు. కౌంటింగ్ అనంతరం ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. ఈ ఎన్నికల్లో పోలీస్ అద్భుతంగా పనిచేసిందని ఐజి కొనియాడారు. ప్రజా తీర్పు బ్యాలెట్ బాక్స్‌ల్లో సిద్ధంగా ఉందన్నారు. పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి శనివారం మండపేటకు చెందిన బొడ్డు అవినాష్ వారి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# మీ సేవలు చిరస్మరణీయం

- శేషజీవితం మంచి ఆరోగ్యంతో, ఆనందంగా గడపండి
- కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్
- ఎస్సై వెంకటేశ్వరరావుకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ మే నెల 31వ తేదీన పదవీ విరమణ చేసిన గండేపల్లి పోలీస్ స్టేషన్ అదనపు సబ్ ఇన్స్పెక్టర్ టేకి వెంకటేశ్వరరావుని జిల్లా ఎస్పీ మరియు అధికారులు సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతయుతంగా విధులు నిర్వహించి, పదవి వీరమణ పొందడం అభినందనీయమన్నారు. పోలీసు డిపార్ట్మెంట్‌లో ప్రజా సేవకే మీ సమయం, శక్తి అన్ని వినియోగించడం పట్ల పోలీస్‌శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ దాదాపు 37 సంవత్సరాలపాటు అంకితభావంతో అందించిన సేవలను పోలీసుశాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. పోలీసు డిపార్టుమెంటు నందు పనిచేయడం సవాలుతో కూడుకొన్నదని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధత తో విధులు నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన నాటి కాలంలో అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించడం మామూలు విషయం కాదన్నారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. శేషజీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో సాగాలని కోరుకుంటున్నానని తెలిపారు. పదవీ విరమణ తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయములో పదవీ విరమణ పొందిన ఎస్సై టేకి వెంకటేశ్వరరావుని ఎస్పీ సన్మానించి జ్ఞాపికను అందచేశారు.ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలి

- అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ సూచన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సరైన నిర్వహణతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులకు సూచించారు.

శనివారం కాకినాడ రూరల్ ఏపీఎస్పీ, రాయుడుపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ సూపర్వైజర్లకు నిర్వహించిన రెండో దశ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్.. జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. కంట్రోల్ యూనిట్ డిస్ ప్లే సరిగా కనిపించని సందర్భంలో, పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లు, ఈవీఎంల లెక్కింపు ప్రక్రియలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్న సందర్భాల్లో అనుసరించాల్సిన విధానం, ఈసీఐ మార్గదర్శకాలపై అవగాహన, అభ్యర్థులు, ఏజెంట్లతో వ్యవహరించాల్సిన తీరు వంటి అంశాలపై సిబ్బంది అవగాహనను ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ..జిల్లాలో జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసేందుకు రిటర్నింగ్ అధికారులకు, కౌంటింగ్ సూపర్వైజర్లకు, మైక్రో అబ్జర్వర్లుకు విస్తృత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ రెండో దశ శిక్షణ కార్యక్రమం ద్వారా కౌంటింగ్ సూపర్వైజర్లను ఏడు విభాగాలుగా విభజించి, విడివిడిగా ఆర్వోలతో అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. జూన్ 3న నిర్వహించే ర్యాండిమైజేషన్ ప్రక్రియతో కౌంటింగ్ సిబ్బందిని ఆయా నియోజకవర్గాలకు కేటాయిస్తామన్నారు. సరైన నిర్వహణతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నప్పుడు ఎటువంటి గందరగోళానికి, తొందరపాటుకు గురికాకుండా ఏజెంట్లకు ఎన్నికల మార్గదర్శకాలు, నియమనిబంధనలు సామరస్యంగా తెలియపరచాలన్నారు. సూపర్వైజర్లు ప్రతి దశలోను అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ నాలెడ్జిపై విద్యార్థులకు శిక్షణ



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణా శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వాట్సప్ ద్వారా పంపిన నీతి కథలను వినిపించడం జరిగింది. గ్రూప్ అభ్యర్థి జి.రాజేష్ జనరల్ నాలెడ్జి మీద పిల్లలకు శిక్షణ ఇచ్చారు. దీనిలో భాగంగా పుస్తక సమీక్ష, పుస్తకాలు చదవడం, స్పోకెన్ ఇంగ్లీష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు అరవింద్, కొమ్మన అప్పారావు, టి.కామరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ సపోర్టింగ్ స్టాఫ్‌కు శిక్షణ



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మహారాణి కాలేజిలో శనివారం మధ్యాహ్నం (39) పెద్దాపురం నియోజకవర్గ ఆర్వో జె.సీతారామారావు ఆధ్వర్యంలో జూన్ 4వ తేదిన జరగబోయే ఓట్ల లెక్కింపుకు సంబంధించి కౌంటింగ్ సపోర్టింగ్ స్టాఫ్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతీ ఒక్క సపోర్టింగ్ సిబ్బంది చేయవలసిన విధుల కోసం వివరించారు. అదే విధంగా కౌంటింగ్ రోజు ఉదయం 6 గంటల లోపు కౌంటింగ్ హాలు వద్దకు చేరుకోవాలని, ఐడి కార్డు మరియు ఆర్డరు కాపీతో విధిగా హాజరు కావాలని, శిక్షణలో సిబ్బందికి ఆర్వో సూచించారు. పార్కింగ్ కోసం స్పోర్ట్ ఆథారిటి స్టేడియంను వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఏఈఆర్వోలు ఎస్.శ్రీనివాసరెడ్డి, వై.శ్రీనివాస్, కె.వి.పద్మావతి, జె.రామారావు, కౌంటింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దారి దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

- నగదు, చాకులు, మోటార్ సైకిల్ సీజ్
- డీఎస్పీ బి రామకృష్ణ వెల్లడి



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్ర పట్టణం శివారు కొత్తూరు బైపాస్ రోడ్డు లో రాత్రి సమయాల్లో వాహనదారులను ఆపి మారణాయుధాలు చూపించి చంపేస్తామని బెదిరించి దారి దోపిడీ చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంపల విజయ శేఖర్ అలియాస్ పండుకి గతంలో రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో 7 క్రిమినల్ కేసులు మరియు రౌడీషీట్ ఉందని, శేఖర్ తన మిగతా మిత్రులతో కలిసి చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించడం కొరకు దారినపోయే వాహనదారులను ఆపి చాకులు, మారణాయుధాలతో బెదిరించి వారి నుండి వస్తువులు దోచుకుని డబ్బులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీఎస్.ఖాదర్ భాష పర్యవేక్షణలో రామచంద్రపురం డిఎస్పి బి.రామకృష్ణ. రామచంద్రపురం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి దొరరాజు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే.సురేష్ బాబు వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దొంగల కోసం గాలిస్తుండగా, శనివారం మరల దొంగతనం చేయడం కోసం పథకం వేసుకొనిటకు రామచంద్రపురం రాజబాబునగర్‌కి చెందిన గంపల విజయ శేఖర్ (పండు), తుమ్మలపల్లి లెమేకు అంబ్రోస్ (చిన్ని), తాతపూడి చిన్ని (నాని) లు వైయస్సార్ నగర్‌లో రైల్వే స్టేషన్ వద్ద కూర్చుని నాగబాబు అనే వ్యక్తి కోసం వేచి చూస్తుండగా పోలీసులు ముగ్గురు ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకొనగా ఒక వ్యక్తి పరారీలో ఉన్నాడని, నేరం కోసం ఉపయోగించిన చాకులు, నగదు మరియు ఒక మోటార్ సైకిల్ ను కేసు దర్యాప్తులో భాగంగా సీజ్ చేయడం జరిగిందని, ముద్దాయిలను కోర్టులో హాజరు పరచడం జరిగిందని డిఎస్పి బి.రామకృష్ణ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి కేసులను ఛేదించిన డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో రామచంద్రపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.దొర రాజు, సబ్ ఇన్స్పెక్టర్ కే.సురేష్ బాబు లను మరియు వారి సిబ్బందిని జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.శ్రీధర్ అభినందించారని డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు.

## రూ.3.09 లక్షలు శృంగార వల్లభ స్వామి ఆదాయం



**పెద్దాపురం,రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసి యున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాణాధికారి వడ్డి శ్రీనివాసరావు, మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,21,420/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.62,408/-లు, కేశఖండన ద్వారా రూ.9,440/-, తులాభారం ద్వారా రూ.350/-, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.15,915/- వెరశి రూ.3,09,533/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. స్వామివార్కి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జూన్6వ తేది వరకు 144 సెక్షన్ అమలు - ఎస్సై సురేష్



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణ మరియు మండలంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎస్పి ఎస్.సతీష్‌కుమార్, డిఎస్పి కె.లతాకుమారి, సిఐ వై.రవికుమార్, సూచనల మేరకు జూన్ 6వ తేది వరకు పట్టణ, మండలంలో 23 గ్రామాలలో 144, పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉంటుందని, పెద్దాపురం ఎస్సై వెలుగుల సురేస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ 5గురికి మించి జనం గుమికూడరాదని, అనుమతులు లేనిదే సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. బాణాసంచా విక్రేతలు బానాసంచా కాల్చడం, అమ్మడం వంటి, ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని ఎస్సై స్పష్టం చేశారు. కొత్తవారికి వారి ఇళ్ళల్లో ఆవాసాలు ఇవ్వరాదని, నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై తగు చర్యలు తీసుకొనబడతాయని, హెచ్చరించారు. లాడ్జిలలో తెలియనివారికి, కొత్తవారికి గదులు అద్దెకు ఇవ్వరాదని, లాడ్జి యాజమాన్యాలకు సూచించినట్లు తెలిపారు. ఎవరైనా కొత్తవారు లాడ్జిలలో గదుల కోసం వస్తే, 144, పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందున తమకు సమాచారం ఇవ్వాలని లాడ్జి సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, సమావేశాలు, ఊరేగింపులు ఎటువంటివి నిర్వహించకుండా, జనం గుమికూడి ఉండకుండా తగు సూచనలు పాటించాలని ఎస్సై సురేష్ ప్రజలకు సూచించారు.

## బిసి విద్యార్థినుల వసతి గృహ ప్రవేశాలకు ఆహ్వానం

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరంలో గల వెనకబడ్డ తరగతుల బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ అధికారి పి కల్పవల్లి తెలిపారు. ఈ ప్రవేశానికి బలహీన వర్గాలకు చెందిన ప్రైవేట్, ప్రభుత్వ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో చదువుతున్న బాలికలు అర్హులన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వసతి గృహంలో వసతి, ఆహార సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎదిగే వయసులో ఉన్న బాలికలకు వ్యక్తిగత రక్షణతో పాటు మంచి ఆహారాన్ని అందించే ఉద్దేశంతో వసతిగృహం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థినిలకు ఉదయం టిఫిను భోజనంతో పాటు రెండుపూటలు కళాశాల ఉంటే లంచ్ బాక్స్ కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు గుడ్డు పాలు అరటిపండు తోపాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం సాయంత్రం భోజనం, వారంలో రెండుసార్లు చికెన్ లేదా మటన్, ఇతర పౌష్టిక ఆహారం అందజేయడం జరుగుతుందని, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని విద్యార్థినిలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. జూన్1వ తేదీ నుండి వసతి గృహప్రవేశాలు ప్రారంభించామన్నారు. మరిన్ని వివరాలకు 9912698818, 9553448046, 9676234125 నంబర్లను గాని, ఏలేశ్వరం పాత పోస్ట్ ఆఫీస్ వద్దగల తమ కార్యాలయంలో గాని స్వయంగా సంప్రదించాలని ఆమె కోరారు.

## 25.2 మెట్రిక్ టన్నుల ఎంటియు 1318 విత్తనాలు సిద్ధం

- మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** 25.2 మెట్రిక్ టన్నుల ఎంటి యు1318 రకం ధాన్యం విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి పి రమేష్ నాయుడు తెలిపారు. జడ్డంగి ఆర్ బి కేకు చెంది11.7, రాజవొమ్మంగి ఆర్ బి కేకు చెంది13.5 మెట్రిక్ టన్నుల విత్తనాలు జడ్డంగి లో దింపడం జరిగిందని రమేష్ నాయుడు తెలిపారు. ఏపీ సీడ్స్ నుండి వచ్చిన ఈ విత్తనాలు మొలక శాతం పరిశీలించిన తర్వాత రైతులకు సరఫరా చేస్తామన్నారు. 90 శాతం సబ్సిడీపైగిరిజన రైతులుకు అందించడం జరుగుతుందని క్వింటాకు398 చెల్లించాలని విత్తనాలు తీసుకునేటప్పుడు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్కు వెంట తీసుకుని రావాలన్నారు. పంట దిగుబడి 150 రోజులు కాలపరిమితిగా ఆయన తెలిపారు. ఈ రకం విత్తనాలు వాడడం వల్ల హెక్టారుకు 87 వేల 500 కేజీలు దిగుబడి వస్తుందన్నారు. ఈ రకం విత్తనాలు వేయడం వల్ల దోమ, అగ్గి తెగులు ను కొంతవరకు తట్టుకుంటుందని ఏవో తెలిపారు.

## గొల్లప్రోలులో ఘనంగా హనుమాన్ జయంతి మహోత్సవములు





**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో దుర్గాడ, మల్లవరం, చందుర్తి, గొల్లప్రోలు, కొత్తపేట రామాలయం, పాపయ్య చావిడి వీధి రామాలయం వద్ద శనివారంహనుమాన్ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుండి వివిధ రామాలయాలలో ఆలయ పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తూ, విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే స్థానిక మెయిన్ రోడ్ సీతారామస్వామి దేవస్థానంతో పాటు వివిధ ఆలయాలలో భజన బృందాలతో ప్రత్యేక భజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే వివిధ ప్రాంతాల రామాలయాలు శ్రీరామ నామస్మరణతో మారుమ్రోగాయి. అనంతరం ఉదయం 10 గంటల నుండి విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఈనెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజున నిబంధనలు పాటించని వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తూహీన్ సిన్హా ఆదేశాలు మేరకు రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ అడహళ్లి పర్యవేక్షణలో కౌంటింగ్ రోజున రంపచోడవరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎవరు గుంపులు గుంపులు గా తిరగకూడదని, ఎక్కడ ఊరేగింపులు, ర్యాలీలు, బాణాసంచా కాల్చటానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని సిఐ తెలియజేసారు. ఈ మేరకు రంపచోడవరం ఎస్ఐ మోహన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రంపచోడవరం పరిసర ప్రాంతాలలో మైక్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

## రాజవొమ్మంగిలో మలేరియా వారోత్సవ ర్యాలీ



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మలేరియా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన రాజవొమ్మంగి లో మెడికల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రంపచోడవరం డివిజన్ ప్రాజెక్టు అధికారి ఆదేశాలమేరకు రాజవొమ్మంగి వైద్యాధికారి "సుష్మా ఆధ్వర్యంలో శనివారం మలేరియా వారోత్సవాలు సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి రాజవొమ్మంగి కమ్మరిపేట గాంధీబొమ్మసెంటర్ బీసీ కాలనీ శివలయంవీ ది గ్రామాపురవేదులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుష్మ మాట్లాడుతూ మలేరియా డెంగ్యూ వ్యాధుల వ్యదుల నివారణ పై తగు జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలని ఇంటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంసుకోవాలని నీటి నిల్వలు లేకుండా సూ సుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ చీదిపల్లి ప్రసాద్, సోమరాజు, ఎల్‌టిలు బి.తమ్మరావు సిహెచ్ వెంకట లక్ష్మి, సంపత్ కుమార్ లక్ష్మన్ హెల్త్ అసిస్టెంట్లు నాని బాబు లక్ష్మయ్య గ్రామస్తులు ఉన్నారు.

# పాలకుల నిర్లక్ష్యమే నిర్వాసితులకు శాపం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పాలకుల నిర్లక్ష్యమే పోలవరం నిర్వాసితులకు శాపమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను సిపిఎం బృందం సేకరించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని దేవీపట్నం మండలంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై పలు నిర్వాసితుల కాలనీలలో సిపిఎం బృందం పర్యటించింది. ఈసందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు నిర్వాసిత కాలనీలలో చాలా ఉన్నాయని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా అనేక ఇబ్బందులు పడుతూ బ్రతుకు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ 18 సంవత్సరాలు నిండిన చాలామంది యువకులకు ప్యాకేజ్ ఇవ్వకపోవడం, పలు గ్రామాలలో కొంతమందికి భూమికి భూమి ఇవ్వలేదని, కొంతమందికి సగం భూమి ఇచ్చి సగం ఇవ్వకపోవడం, పోలవరం నిర్వాసితులకు సంబంధించిన ఏ ప్యాకేజీ చాలా గ్రామాలలో ఇప్పటికి అందని ద్రాక్షగా ఉందని ఆయన పాలకుల మీద మండిపడ్డారు. ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా నిర్వాసితులకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉండాల్సింది పోయి ఏదో ఒక కారణంతో నిర్వాసితుల సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారని ఆయన తెలిపారు. ఇటీవల పోలవరం నిర్వాసితుడు ఒకరు పోలవరం ప్రాజెక్ట్ కార్యాలయం దగ్గర పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయడం జరిగిందని ఆయన అన్నారు. పోలవరం ప్యాకేజ్, పునరావాసం, భూమికి భూమి, ఇతర అనేక నష్టపరిహారం ఇప్పటికి రాని నిర్వాసితులు ఇంకా చాలామంది మిగిలి ఉన్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చెయ్యాలని అన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సిపిఎం పార్టీ ఎప్పుడూ నిర్వాసితులకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం ఎప్పుడు పోరాటానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ - రంపచోడవరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మట్ల వాణిశ్రీ, కంభం శాంతిరాజు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇప్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్
- డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కు లేఖ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ లోపల ప్రమాదంలో చనిపోయిన ఉల్లి దేవుడు కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇప్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాకినాడ కు లేఖ వ్రాసారు.
సామర్లకోట పెద్దాపురం ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నందు 01-06-2024 తేదీన సాయంత్రం 4.30 సమయంలో పారా బ్రాయిలర్ వద్ద పనిచేస్తున్న ఉల్లి దేవుడుపై (36) పైనుండి మోటారు విడిభాగాలు పడడంతో అక్కడికక్కడే చనిపోవడం జరిగిందన్నారు. ఇలా పట్టాభి ఆగ్రో పరిశ్రమ ప్రమాదాలలో కార్మికులు చనిపోవడం ఇది నాలుగవసారి అని గుర్తు చేశారు. ప్రమాదం ఎప్పుడు జరిగినా యాజమాన్యం కనీసం కుటుంబ సభ్యులకుగానీ, సంబంధిత ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్ కిగాని, కార్మికశాఖ అధికారులకు గానీ సమాచారం ఇవ్వకుండా కప్పిపుచ్చి, చట్టం నుండి తప్పించుకునే క్రిమినల్ నేరానికి పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రేవేట్ లిమిటెడ్ యాజమాన్యం పాల్పడుతోందని ఆరోపించారు. కావున తమరు కలుగజేసుకొని ప్రమాదంలో చనిపోయిన ఉల్లి దేవుడు కుటుంబానికి వర్క్‌మెన్ కాంపెన్సేషన్ ఆక్ట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించేలాగున చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ప్రమాదాలు మరలా జరగకుండా పరిశ్రమను సంపూర్ణంగా తనిఖీ చేసి, సేఫ్టీ అధికారులు కార్మికుల భద్రతపై సంతృప్తి చెందేవరకు పరిశ్రమలో ఉత్పత్తిని నిలుపుదల చేయాలని, ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేసిన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘటనా స్థలంలో చనిపోయిన కార్మికుని కుటుంబానికి 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని పెద్దాపురం సిఐటియు మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతల సత్యన్నారాయణ డిమాండ్ చేశారు.

## విత్తనములు, ఎరువు మందులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె. ఎస్. ఎస్. వి సుబ్బారెడ్డి, ఆదేశముల మేరకు విజిలెన్స్ అధికారులు మరియు వ్యవసాయ శాఖ అధికారులతో సంయుక్తముగా కాకినాడ జిల్లాలలోని గొల్లప్రోలు మండలము మరియు గ్రామములోని రెండు విత్తనముల షాపులను తనిఖీ చేయటమైనది. స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్ ను తనిఖీ చేయగా, డీలర్ స్టాక్ రిజిస్టర్ సక్రమముగా నిర్వహించకపోవుట చేత మండల వ్యవసాయ అధికారి, గొల్లప్రోలు వారు సుమారు రూ 1,49,472/-విలువ గల 82,175 కేజీల ప్రత్తి విత్తనముల అమ్మకములను నిలుపుదల చేసియున్నారు. శ్రీ శివ ఏజెన్సీస్ ను తనిఖీ చేయగా, సదరు షాపు నందు ఎటువంటి వ్యత్యాసములు కనుగొనబడలేదు. ఈ సందర్భముగా రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె. ఎస్. ఎస్. వి సుబ్బారెడ్డి, మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో ఎరువులు, విత్తనములు మరియు పురుగుమందుల దుకాణలలో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయి అని, ఎవ్వరైనా ఎరువులు, విత్తనములు మరియు పురుగుమందులను గరిష్ట అమ్మకపు ధర కన్న ఎక్కువ ధరకు అమ్మకము చేసిన, అక్రమ నిల్వలు వుంచిన, నకిలీ విత్తనములు అమ్మకములు చేసిన స్టాక్ రిజిస్టర్లు సక్రమముగా నిర్వహించకపోయిన, సదరు దుకాణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపియున్నారు. ఈ తనిఖిలలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, శ్రీనివాసరెడ్డి, భార్గవ మహేష్, నవీన్, జగన్నాథరెడ్డి, వలి, కిషోర్, శివ, గొల్లప్రోలు మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

# యువత ధూమపానానికి దూరంగా ఉండాలి

-పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ పి. సుజాత




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, ధూమపానం వలన ఊపిరితిత్తులు చెడిపోతాయని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ పి సుజాత అన్నారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం నందు ప్రపంచ పొగాకు ఉత్పత్తుల నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ధూమపానం కారణంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు పాడవడం, గుండె జబ్బులు వంటివి వస్తాయని, పొగత్రాగే ప్రదేశాలలో గర్భిణీ స్త్రీలు ఉండకూడదని, బహిరంగ ప్రదేశాలలో ధూమపానం ఇతరులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు. ధూమపానం మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి సి పి అధికారి పి. రాఘవులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, డాక్టర్ అశ్విని, డాక్టర్ మాధురి, డాక్టర్ విక్టోరియా, మరియు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది టిబి యూనిట్, ఐ సి టి సి యూనిట్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండల వ్యాప్తంగా వాడవాడల హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలతో వేడుకలు ప్రారంభించారు భారీగా భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల్లో ఆలయాల వద్ద అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. స్వామివారిని గ్రామాల్లో ఊరేగించారు. మల్లేపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన వేంచేస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారిని జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. మల్లేపల్లి లో ఆంజనేయ స్వామివారిని రథంపై గ్రామమంతా భాజా భజంత్రీలు, కోలాట నృత్యాలు, రాముడు సీత లవకుశ వేషధారణలతో జైశ్రీరామ్ జై హనుమాన్ అనే నినాదాలతో ఊరేగించారు.

## ఘనంగా రాంబాబు పదవీ విరమణ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం విభాగంలో ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న బి.రాంబాబు పదవీ విరమణ సందర్భంగా రాంబాబు దంపతులను దేవస్థానం కార్యనిర్వహణాధికారి పూలమాలవేసి శాలువా కప్పి సన్మానించి స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు మరియు మరియు అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు, సెక్రెటరీ బలువు వాసు, ఉపాధ్యక్షులు అనకాపల్లి ప్రసాదు, ట్రెజరర్ పెద్దింటి తలుపులయ్య, పలు విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి తూర్పు, మధ్యమ,పశ్చిమ డెల్టాలకు సాగునీరు విడుదల

-మూడు ప్రధాన పంట కాలువలకు 3 వేల క్యూసెక్కుల సాగునీరు విడుదల

-సకాలంలో నాట్లు వేయడం వలన తుఫాను, వరదలు వంటి ప్రకృతి విపత్తుల నుంచి పంటలకు రక్షణ

-కలెక్టరు కే.మాధవీలత

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** 2024 – ఖరీఫ్ కు పంటకు సంబందించి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని డెల్టాల భూముల ఖరీఫ్ పంటకు నేడు సాగుకు నీరు విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టకరు డా. కే.మాధవీలత పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ మాధవీలత ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి తూర్పు, మధ్యమ, పశ్చిమ డెల్టాల మూడు ప్రధాన పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో



ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీరు ఆర్.సతీష్ కుమార్, ఇరిగేషన్ ఎస్.ఈ.జి. శ్రీనివాసులు, ఈఈ ఆర్. కాశీవిశ్వేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు డా. మాధవీలత మాట్లాడుతూ ఖరీఫ్-2024 ఖరీఫ్ పంట సాగుకు తూర్పు, మధ్యమ, పశ్చిమ డెల్టాల మూడు ప్రధాన పంట కాలువలకు సాగునీరు విడుదల లో భాగంగా ధవళేశ్వరం వద్ద డెల్టా కాలువలకు సాగునీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. రైతులు సకాలంలో నాట్లు వేసుకోవడం వనల ప్రకృతి విపత్తులు తుఫానులు, వరదలు వంటి ముంపు బారిన పడకుండా పంటలు రైతు చేతికి అందేలా జూన్ 1 వ తేదీనే నేడు కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. గత రెండు సంవత్సరాలుగా రైతులకు సకాలంలోనే సాగునీటిని విడుదల చేస్తున్నామని, గోదావరి నదిలో 8 వేల క్యూసెక్కుల నీరు నిల్వ ఉందని, అదనపంగా ఉన్న 3 వేల క్యూసెక్కుల సాగునీటిని మూడు డెల్టాలకు విడుదల చేస్తున్నామన్నారు. ఖరీఫ్ పంటకు సంబందించిన సకాలంలో సాగునీటిని విడుదల చేస్తున్నందున్న రైతులు సకాలంలో నాటులు వేసుకోవాలని విన్నవించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అన్నీ అందుబాటులో వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీరు ఆర్.సతీష్ కుమార్, ఇరిగేషన్ ఎస్.ఈ.జి. శ్రీనివాసులు, ఈఈ ఆర్. కాశీవిశ్వేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## వాడపల్లి సన్నిధి భక్తజన పెన్నిధి

- భక్తజనంతో పులకించిన క్షేత్రం





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్త జనంతో పులకించింది. తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులను తీర్చుకున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యా వచనం, కళ్యాణం వంటి కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. శనివారం స్వామివారి ఆదాయం రూ.30 లక్షలు సమకూరింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### పోలీసు జోన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాజమహేంద్రవరం దక్షిణ మండల పోలీసు జోన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు మరో నెలపాటు అనగా 01-06-2024 నుండి 30-06-2024 వరకు పొడిగించడం జరిగింది. రాజమహేంద్రవరం దక్షిణ మండల పోలీసు జోన్ పరిధిలో ఉన్నటువంటి 1) రాజమహేంద్రవరం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్, 2) ధవళేశ్వరం పోలీస్ స్టేషన్, 3) కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ప్రాంతాలకు ఇది వర్తిస్తుంది. వీటి ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదు. అటువంటివి జరపడానికి రాజమహేంద్రవరం దక్షిణ మండల పోలీసు జోన్ %ఞూా% వద్ద ముందుగా అనుమతి పొందవలసి ఉంటుంది. ఈ విషయాన్ని అందరూ గమనించి, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు ఎప్పటిలాగే అందరూ సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

### రాజవొమ్మంగిలో శ్రీ ప్రసన్న అంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన రాజవొమ్మంగి లో శనివారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎలిమెంటరీ స్కూల్ ఎదురుగా ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి గుడి వద్ద ఆంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు వెయ్యి మందికి అన్న ప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు స్వామివారికి సింధూరం పూసి తమలపాకుల తోరణాలతో గుడిని అలంకరించారు. భక్తులు వేకువజాము నుండి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలతో పాటు భక్తులకు చల్లనిమజ్జిగ అందజేశారు. ఆలయ నిర్వహకులు పొట్లాడ చక్రం కుటుంబ సభ్యులు నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. 30 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరతాయని మండల ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఆలయ చుట్టుపక్కల ఉన్న భక్తులతోపాటు మహిళా భక్తులు, యువకులు పాల్గొని వారి సేవలను అందజేశారు.

## పూర్ణాహుతితో ముగిసిన ఖండవల్లి హనుమత్ జయంతోత్సవాలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం లోని ఆంజనేయస్వామి ఆలయాలన్నీ జూన్ ఒకటో తేదీ శనివారం హనుమత్ జయంతి సందర్భంగా స్వామివారిని దర్శించుకొనేందుకు వచ్చిన నాయకులు భక్తులతో కిటకిటలాడాయి. పెరవలి మండల వ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా తెల్లవారుజాము నుండే అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు క్యూ లైన్ లలో వచ్చి అంజన్నను దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ ల సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. ఖండవల్లి గ్రామంలో వడలి ముక్కామల రోడ్డు ప్రక్కన వేంచేసి ఉన్న అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద హనుమత్ జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుండి భారీ ఎత్తున ప్రజలు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ దంపతులు నిడదవోలు మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేశ్ లు అభయ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్గురు నాయకులు ఒకేసారి రావడంతో భక్తులు కార్యకర్తలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ రోజు పితాని పెళ్లి రోజు కూడా కావడంతో అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. హనుమత్ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన ఈ పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఖండవల్లి సూర్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త ప్రోత్సాహకులు భూపతిరాజు వరాహ వెంకట సూర్యనారాయణ రాజు (కృష్ణ) హైమా సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో భూపతిరాజు భాస్కర్ మోహిత దంపతులు భూపతిరాజు సత్య సుబ్రహ్మణ్యరాజులునిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు బుచ్చి రామచంద్రరాజు (దత్తుడు రాంబాబు) ఆంజనేయస్వామి గుడి పురోహితుడు రాంబాబు, గోపాల్, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షుడు భూపతిరాజు రవివర్మ, మాజీ సర్పంచ్ భూపతిరాజు వరాహనరసింహరాజు ఖండవల్లి గ్రామ ఉపసర్పంచ్ అతికాల కృష్ణమ్మ, మైపాల ప్రసాద్, రెడ్డి సత్యనారాయణ, అనుకూల శ్రీనివాస్ హనుమంతు చైతన్య పాల్గొన్నారు

## మైనర్ బాల బాలికలకు వాహనాలు నడిపే అవకాశం ఇవ్వడం చట్టరీత్యా తప్పు



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** మోటార్ వాహనాలు ఇచ్చి మైనర్లు డ్రైవింగ్ చేయడానికి కారణమైనటువంటి వాహన యజమాని లేదా వాహన ఇంచార్జ్ లు మోటార్ వాహనాల చట్టం ప్రకారం శిక్షకు అర్హులు అధికారులు తెలిపారు. అధీకృత లైసెన్స్ లేని వారు వాహనాన్ని నడపడం తద్వారా ఏదైనా ప్రమాదానికి గురి అయితే అతని కుటుంబం మరియు దాని ద్వారా గాయాలపాయలైన వారు లేదా చనిపోయిన వారి కుటుంబాలు రోడ్డున పడతాయి. ఇది ఎవరికి అభిలషణీయం కాదు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ లో 9 మంది మైనర్లకు వారి యొక్క కుటుంబ పెద్దలకు సౌత్ జోన్ డీఎస్పీ మరియు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనాలు నడిపేటటువంటి మైనర్లపై డ్రైవ్ చేయడం జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో 9 మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతుండగా పట్టుకోవడం జరిగింది. ఈరోజు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ వద్ద ఎం. అంబికా ప్రసాద్, ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ జి. వి.వినయ్ మోహన్, సబ్ ఇన్స్పెక్టర్ వి.క్రాంతి కుమార్ లు సదరు మైనర్ డ్రైవర్లకు మరియు వారి తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు మరియు వారి సంరక్షకులకు కౌన్సిలింగ్ నిర్వహించి, రోడ్డు భద్రత నియ మాలు గురించి అవగాహన కల్పించడం జరిగింది. డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి వాహనాన్ని ఇచ్చి డ్రైవింగ్ చేయించడానికి కారణం కాకూడదని పెద్దలకు చెప్పడం జరిగింది. మొత్తం 9 ద్విచక్ర వాహనాలకు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ వారు మొత్తంగా 5 వేల రూపాయలను ఈ-చలాన్ రూపంలో వాహన యజమానులకు జరిమానాలను విధించడం జరిగింది.

## భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి పూజలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణ మండల పరిధిలో శనివారం హనుమాన్ జయంతి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కోట్లమ్మచెరువు వద్ద గల స్వయంభుగా వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త క్షత్రి రాజారాం సింగ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో హనుమ జయంతి పూజలు నిర్వహించారు. తొలుత వినాయక పూజ పుణ్యాహవాచనం, ఆంజనేయ స్వామి వారి విగ్రహానికి పంచామృత అభిషేకాలు అర్చకుల బృందం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఆంజనేయ హెూమం పూజలు, ఆంజనేయునికి లక్ష తమలపాకుల పూజలు చేపట్టారు. పూజల్లో న్యాయవాది వనమోజు రాఘవేంద్ర దంపతులు, పారిశ్రామికవేత్త నేరెళ్ల గంగాధర్ దంపతులు, దివంగత ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త క్షత్రి సీతారాం సింగ్ కుటుంబ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే స్థానిక పెద్దాపురం రోడ్లో గల అతి ఎత్తైన ప్రసన్నాంజనేయ స్వామి వారి విగ్రహాలయం వద్ద, స్థానిక స్టేషన్స్ సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయంలోని హనుమజయంతి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ




**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని గత 15 రోజులుగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామర్లకోట ఏరియా ఆసుపత్రి, డాక్టర్ వైయస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, వివిధ రకాల వ్యర్థాలను స్వచ్ఛత పక్వాడాలో భాగంగా పవర్ గ్రిడ్ సిబ్బంది తొలగించారు. మొత్తం పది ట్రాక్టర్ల వ్యర్థాలను శుభ్రం చేసి బయటకు తరలించడం విశేషం. పిచ్చి మొక్కలతోనూ, వ్యర్థాలతో నిండిన ఆవరణను ఆహ్లాదంగా మార్చడం పట్ల డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, రోగులు తదితరులు అభినందించారు. వీటివల్ల పాముల భయం ఉండేదని ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా ఉందని సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని పవర్ గ్రిడ్ సిబ్బంది నిజమైన స్ఫూర్తితో నిర్వహించడం ఎంతో అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ జే రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ డిజిఎం సత్య వర్ధన్, మేనేజర్ కోటేశ్వరరావు, జేఈ మూర్తి, పలువురు సిబ్బంది, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కౌంటింగ్ సిబ్బంది 2వ ర్యాండమైజేషన్ పూర్తి

-నియోజక వర్గాల వారీగా కేటాయింపు

-జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జూన్ 4 వ తేదీన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లు లెక్కింపు కోసం కౌంటింగ్ సిబ్బందిని నియోజక వర్గాల వారీగా కేటాయింపులు చెయ్యడం జరిగిందనీ కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా కె మాధవీలత పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల కౌంటింగ్ పరిశీలకుల బీజై కుమార్ కందయాత్ రాయ్, టాన్ సింగ్ జి. మోమిన్ సమక్షంలో ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీ లత మాట్లాడుతూ, పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియని నిర్వహించేందుకు సాంకేతిక పరమైన విధానంలో కౌంటింగ్ సిబ్బందిని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. రెండో ర్యాండమైజేషన్ లో భాగంగా కౌంటింగ్ నిర్వహించే క్రమంలో తొలి ర్యాండమైజేషన్ లో గుర్తించిన సిబ్బందిని నియోజక వర్గాల వారీగా కేటాయింపులు చెయ్యడం జరిగిందనీ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లాకు నలుగురు ఎన్నికల కౌంటింగ్ పరిశీలన కోసం నలుగురు పరిశీలకులను నియమించడం జరిగిందన్నారు. కే. బాల సుబ్రహ్మణ్యం, కమల్ కాంత్ సరోఛ, బీజై కుమార్ కందయాత్ రాయ్, టాన్ సింగ్ జి. మోమిన్ లు జూన్ 4 న జరిగే కౌంటింగ్ ప్రక్రియని వారి సమక్షంలో నిర్వహిస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించే క్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ , బీజై కుమార్ కందయాత్ రాయ్ , టాన్ సింగ్ జి. మోమిన్ , డి ఆర్వో జి నరసింహులు, సిపివో ఎల్. అప్పలకొండ, ఎన్ ఐ సి అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిహెచ్ఎస్‌గా పద్మశ్రీ



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కో-ఆర్డినేటర్ డా ఎన్ పి పద్మశ్రీ జిల్లా కలెక్టర్ డా కె మాధవీలత శనివారం ఉదయం కలెక్టర్ ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కో-ఆర్డినేటర్ డా ఎమ్. సనత్ కుమారి చక్కటి పనితీరు కనపర్చడం జరిగిందనీ, అదే విధంగా మరింత మెరుగ్గా బాధ్యతలను నిర్వర్తించి ప్రజలకి వైద్య సేవలు అందించే క్రమంలో ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకోవడం ద్వారా తమదైన ముద్ర వెయ్యాలని తెలియ చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ వివరాలు తెలియ చేస్తూ, డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి డీ సి హెచ్ ఎస్ గా బదలీపై రావడం జరిగిందన్నారు. అంతకు ముందు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పని చేసినట్లు తెలిపారు. కొవ్వూరు కేంద్రంగా ఉన్న డి సి హెచ్ ఎస్ కార్యాలయం ద్వారా ఏరియా ఆసుపత్రిలో విధులను నిర్వర్తించడం జరుగుతుందనీ తెలిపారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు- ఎస్సై బాలాజీ





**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** ఎన్నికలు కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో యువత అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గొల్లప్రోలు ఎస్సై బాలాజీ శనివారం పట్టణ పరిధి స్థానిక రాయవరం రోడ్డు మార్కెట్ సెంటర్లో ప్రజలకు యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాలాజీ మాట్లాడుతూ జూన్ ఆరో తారీకు వరకు పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా మసులుకోవాలన్నారు. అలాగే ఎంతటివారైనా మందుగుండు సామాగ్రి, మద్యం, మారణాయుధాలు లాంటివి దగ్గర ఉంచుకున్నా, ఉపయోగించినా కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కార్యక్రమంలో ప్రజలకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరెండెంట్, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గున్నాబత్తుల శ్రీనివాసు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## ప.గో.జిల్లా పరిషత్ సమావేశంలో శాఖల ప్రగతి పై సమీక్ష

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ ప్రణాళిక, విద్య, త్రాగునీరు, విద్యుత్, ఇరిగేషన్, శాఖల అభివృద్ధి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో తమతమ శాఖల ప్రగతి నివేదికలపై వివరణ, సమీక్ష జరిగింది. సమావేశంలో జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, వివిధ శాఖల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణలో చదవటం మాకిష్టం కార్యక్రమం

**నరసాపురం,మేజర్ న్యూస్ :** ప్రథమ శ్రేణి శాఖ గ్రంధాలయం నందు నిర్వహించబడుతున్న వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారంఏపీ సెర్ట్ వారు ప్రచురించిన "చదవడం -మాకిష్టం" ప్రోగ్రాంలో నీతి కథలు సింహము-ఎలుక, పరమానందయ్య శిష్యుల కథలు,కుక్క..మాంసపు ముక్క తదితర నీతి కథలును పిల్లలు కు వీడియో ద్వారా రిసోర్స్ పర్సన్ జీవన్ కుమార్ చూపించడం వినిపించడం జరిగింది. చిత్రలేఖనంఆర్టిస్టు తోట శ్రీనివాస్,కరాటే లో టి కృష్ణ శిక్షణ ఇచ్చినారు. అనంతరంపిల్లలకు రైమ్స్ పాటలు ఆటలు ఆడించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రంగినీడి సుబ్బారావు, జ్ఞాన ప్రకాష్,సుదీర్ మోహన్,సూర్యం బాబు,శ్రీనివాస్ మాస్టర్ , ప్రవీణ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.